

ప్రజలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

ప్రభుత్వ పాఠశాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

బాలానగర్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): స్కూలు నిర్మాణం పనులు త్వరితగతంగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కాంట్రాక్టర్‌కు సూచించారు. బాలానగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొదట బాలానగర్ డివిజన్ రాజూకాలనీ కమ్యూనిటీ హాలులో తెలంగాణ సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు నిత్యావసర వస్తువులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కాన్ఫడరేషన్ కార్యదర్శి రాంచంద్రయ్య, డివిజన్ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే చరబండ రాజూ కాలనీలో నిర్మాణదశలో ఉన్న ప్రభుత్వ పాఠశాల నిర్మాణం పనులను పరిశీలించారు. బాలానగర్ హైస్కూల్ హెచ్ఎం అరుణ్ జ్యోతి, బీఆర్ఎస్ నాయకులు రవీందర్, మహంకాళి సూరి ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

● గొడ్డలి దాడిలో మృతి చెందిన బాధిత కుటుంబానికి పరామర్శ

బాలానగర్ డివిజన్ దామోదరసంజీవయ్య కాలనీలో ఆగస్టు 27న జరిగిన గొడ్డలి దాడిలో మృతి చెందిన ఏర్పుల ముఖేందర్ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే కృష్ణారావు పరామర్శించారు. ఈ ఘటనలో కొడుకును, భార్యను కోల్పోవడం దురదృష్టకరమని ముఖేందర్ తండ్రి రాజమల్లయ్యను ఓదార్చారు.

దీన్‌దయాల్‌నగర్‌లో డీసీ, కార్పొరేటర్ పర్యటన



దీన్‌దయాల్‌నగర్‌లో పర్యటిస్తున్న డీసీ అశోక్‌కుమార్, కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఫతేనగర్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్ లోతట్టు ప్రాంతం దీన్‌దయాల్‌నగర్‌లో మూసాపేట్ సర్కిల్ ఉపకమిషనర్ అశోక్‌కుమార్, కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ బుధవారం పర్యటించారు. గత 4 రోజులుగా కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు వారు బస్తీలో పర్యటించారు. బస్తీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ చేయాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. దీన్‌దయాల్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహేందర్, జనరల్ సెక్రటరీ సతీష్, అశోక్, విజయభాస్కర్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుడు లింగంను ఆదుకోవాలి



గాయపడిన లింగంను పరామర్శిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఫతేనగర్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో భాగంగా విద్యుత్ స్తంభంపై నుంచి పడి గాయపడిన కాంట్రాక్ట్ కార్మికుడు లింగంను విద్యుత్ శాఖ అధికారులు ఆదుకోవాలని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అధికారులను కోరారు. లింగం గాయపడిన విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్ ఆయనను మంగళవారం పరామర్శించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎలాంటి సహాయం కావాల్సినా తనకు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో భిక్షపతి, ఎల్‌వి నాయుడు, కుక్కల రాము ముదిరాజ్, మోహన్, భాగయ్య, వీరేశంగుప్తా, సురేందర్‌నాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరిస్తా



సబ్‌స్టేషన్‌కు స్థలాన్ని పరిశీలిస్తున్న హన్మంత్‌రెడ్డి, విద్యుత్ అధికారులు

దుండిగల్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని శంభీపూర్, మల్లంపేట్, బౌరంపేట్ గ్రామాల్లో నెల రోజులుగా విద్యుత్ సమస్యలు ఏర్పడుతున్నాయని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డికి కేవీఆర్, స్ప్రింగ్ ఉడ్స్ ప్రణీత్ నతురల్ బౌంటీ, ల్యాక్‌లిడ్డి కాలనీవాసులు తెలిపారు. దీంతో ఆయాగ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌కో ఎస్సీ రంజీ, ఏడీఈ అరుణ్, ఎస్సీ రవికుమార్, డీఈ విష్ణువర్ధన్‌రెడ్డిలతో పాటు కొలన్ హన్మంత్‌రెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డి బుధవారం పర్యటించారు. సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు విద్యుత్ అధికారులు, నాయకులు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో శాంతకుమార్, చక్రవర్తి, హరికృష్ణ, సాయికుమార్ పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న బండి రమేష్, కాంగ్రెస్ నాయకులు

సీఎంఆర్ఎఫ్ పేదలకు ఆసరా

ఓల్డుబోయినపల్లి, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పేదల ప్రజలకు ఎంతో ఆసరానిస్తోందని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందిన ఓల్డుబోయినపల్లి నివాసి తహెజీంకు మంజూరైన రూ.60 వేల చెక్కును కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, శ్రీకాంత్‌పటేల్, శివచౌదరీ, బచ్చు మల్లి, అస్లాం, రజిత, సంధ్య, బోజమ్మ పాల్గొన్నారు.

నాలా కల్వర్టు పనుల్లో వేగం పెంచండి



కల్వర్టు పనులను పర్యవేక్షిస్తున్న మహేందర్

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్4 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని స్నేహపురి నాలా కల్వర్టు పనుల్లో వేగం పెంచాలని అధికారులను కార్పొరేటర్ మహేందర్ ఆదేశించారు. ఈ మేరకు అక్కడ జరుగుతున్న నాలా స్లాబ్ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు దగ్గర ఉండి పనులు పరిశీలించాలని, పనుల్లో వేగం పెంచడంతో పాటు నాణ్యత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ఎర్ర స్వామి, బసవరాజు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మృత్యువాత పడిన గేదె

దుండిగల్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూగజీవి విద్యుదాఘాతంతో బుధవారం మృతి చెందింది. బౌరంపేట్‌కు చెందిన రైతు నాచారం మల్లేష్‌యాదవ్ తన బర్రెలను రోజుమాదిరిగానే పొలంలోకి మేతకు తోలుకు పోతుండగా మార్గమధ్యలోని ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పచ్చని తీగలు అల్లుకొని ఉన్నాయి. గేదె వాటిని తినబోతుండగా విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడింది. రెండు లక్షల విలువ చేసే తన గేదె మృతి చెందిందని మల్లేష్‌యాదవ్ వాపోయాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తన గేదె మృతి చెందిందని, వారే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి - బాధితుల ధర్నా

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట సొసైటీలోని న్యూ లైఫ్ ఫిజియోథెరపీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న అల్లె వెంకటేశ్వర్లు మంగళవారం రాత్రి 11.30 గంటల సమయంలో మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం, అధిక మెడిసిన్ డోస్ ఇవ్వడం వల్లే చనిపోయారని మృతుడి బంధువులు బుధవారం ఆస్పత్రి ఎదుట బుధవారం ఆందోళన చేశారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేశారు. వైద్యులు నిషాల్, ముహిత్, ఆసుపత్రి నిర్వాహకులను బాధ్యుల్ని చేయాలని ఆమె కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ల తవ్వకాలు

బాధితుల ఫిర్యాదుతో సెల్లార్‌ను సందర్శించిన అధికారులు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా జీహెచ్ఎంసీలో సెల్లార్ల తవ్వకంపై నిషేధం కొనసాగుతోంది. ఓ నిర్మాణదారుడు అక్రమంగా సెల్లార్ పనులను చేపట్టాడు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిర్మాణం అంతర్భాగం కృంగి పోయింది. సెల్లార్ చుట్టూ పక్కల ఉన్న మరో అపార్టుమెంట్‌లతో పాటు నివాస ఇళ్లకు ప్రమాదం పొంచి ఉంది. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని అంగడిపేట, విలేజ్, హైటెన్షన్ ఎస్ బ్యాంక్ పక్కనే సెల్లార్ పనులు జరుగుతున్నాయి. కురుస్తున్న వర్షానికి సెల్లార్‌లోని మట్టి కూరుకుపోయింది. దీంతో సెల్లార్ గుంతను ఆనుకొని ఉన్న ఇంటి మెట్లు, బాత్రూమ్ పూర్తిగా కూలిపోయే పరిస్థితి నెలకొంది. బాధితులుసెల్లార్ నిర్మాణ దారుడిని నిలదీసి, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నర్సింహ సిటీప్లానర్, అసిస్టెంట్ ప్లానర్ గణపతి కుత్బుల్లాపూర్ టౌన్ ప్లానింగ్ అధికారి ప్రభావతి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అధికారులు నిర్మాణదారున్ని హెచ్చరిస్తూ ప్రమాదాలు జరుగకుండా తాత్కాలికంగా సిమెంట్ సంచుల్లో ఇసుక పోసి సెల్లార్ కూలకుండా చూడాలన్నారు.



సెల్లార్‌లో మట్టి కూలిన ప్రాంతంలో ఇసుక బస్తాలను వేస్తున్న కూలీలు



సెల్లార్ నిర్మాణదారుడితో మాట్లాడుతున్న ఉప కమిషనర్ నర్సింహ(ఫైల్)

● నిర్మాణదారుడికి రూ. 2 లక్షల జరిమానా

నెల రోజుల నుంచి సెల్లార్ పనులు జరుగుతున్నాయని ఉప కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తున్న నిర్మాణదారుడికి రూ.2 లక్షల జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసిన బాధిత కుటుంబాలకు నిర్మాణాలతో ఎలాంటి ఇబ్బందులు కలిగించనని నిర్మాణదారుడు లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు.

పేదల సమస్యలపై మార్క్స్, అంబేడ్కర్ భావాలు ఒక్కటే

రాంనగర్, సెప్టెంబర్4 (ఆంధ్రజ్యోతి): పేదల సమస్యలను పరిష్కరించడానికి మార్క్స్, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ భావాలు ఒకటేనని ఉమ్మడి రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు అన్నారు. యువత మార్క్స్, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌లను స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేయాలని సూచించారు. బుధవారం తెలంగాణ ప్రజా సాంస్కృతిక ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ రచయిత జి.రాములు రచించిన 'లాల్‌నీల్ స్ఫూర్తి ప్రదాతలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకి మాధవరావు పాల్గొని మాట్లాడారు. రచయిత 'లాల్ నీల్ స్ఫూర్తి ప్రదాతలు' పుస్తకంలో అనేక మంది ప్రముఖులకు సంబంధించిన స్ఫూర్తిదాయకమైన విషయాలను ప్రస్తావించడం అభినందనీయమన్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, జస్టిస్ బి.చంద్రకుమార్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఎస్.వీరయ్య, ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, ప్రొఫెసర్ ననుమాస స్వామి, జిలకర శ్రీనివాస్, డాక్టర్ పసునూరి రవీందర్, కె.ఆనందాచారి, బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్, తంగిరాల చక్రవర్తి పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కాకి మాధవరావు



అమీర్‌పేట స్వర్ణజయంతి కాంప్లెక్స్ హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయంలో బుధవారం మట్టి గణేశ్ ప్రతిమలను పంపిణీ చేస్తున్న కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, అధికారులు

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

ఎన్‌సీసీ కెడెట్ వైష్ణవికి సన్మానం

అల్వాల్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): నేషనల్ కెడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ)పై దృష్టి సారించే యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ (వైఈపీ) తాజాగా ఖజకిస్థాన్‌లో నిర్వహించారు. భారతదేశం, మధ్య ఆసియా దేశాల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడానికి ప్రతి ఏటా ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సికింద్రాబాద్ గ్రూపునకు చెందిన కెడెట్ వైష్ణవి మడుపు వివిధ రాష్ట్రాల నుంచి వెళ్లిన 11 మంది ఎన్‌సీసీ కెడెట్‌ల ప్రతినిధుల బృందంలో ఖజకిస్థాన్‌ను సందర్శించి తిరిగి హైదరాబాద్‌కు వచ్చారు. ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ మధుసూదన్‌రెడ్డి బుధవారం వైష్ణవిని తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

నీటి గుంతలో పడి వృద్ధుడి మృతి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నీటి గుంతలో పడి వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నూతన్‌కల్ గ్రామ శివార్లలోని నీటిగుంటలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనబడటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు నీటిగుంత నుంచి మృత దేహాన్ని వెలికతీయగా మృతుడు శ్రీరంగవరం గ్రామానికి చెందిన జనార్ధన్‌రెడ్డి(70)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమితం నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించి, కుంటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన పద్మావతి

రవీంద్రభారతి, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ అవార్డు గ్రహీత, కళాకారిణి డాక్టర్ పద్మావతి బుధవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను సత్కరించారు. అనంతరం పద్మావతి మాట్లాడుతూ.. నవంబర్‌లో జరుగబోయే పద్మావతి ఇనిస్టిట్యూట్ ఫర్ డిసేబుల్డ్ సంస్థ రజతోత్సవ వేడుకలకు హాజరు కావాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను ఆహ్వానించినట్లు తెలిపారు. దీంతో పాటు దివ్యాంగ కళాకారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని కోరినట్లు ఈ సందర్భంగా తెలిపారు. దివ్యాంగ కళాకారులకు రూ25 వేల పెన్షన్, ప్రభుత్వ కార్యక్రమాల్లో అవకాశాలు కల్పించాలని కోరారు.

వచ్చే నెల 4 నుంచి ఎస్ఎఫ్ఏ పోటీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): స్పోర్ట్స్ ఫర్ ఆల్ (ఎస్ఎఫ్ఏ) చాంపియన్‌షిప్ వచ్చే నెల 4వ తేదీ నుంచి జరగనున్నాయి. హైదరాబాద్‌తో సహా దేశంలోని పది ప్రధాన నగరాల్లో జరగనున్న ఈ చాంపియన్‌షిప్‌లో 31 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఇప్పటివరకు దాదాపు లక్షన్నర మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. హైదరాబాద్ అంచె పోటీలు గచ్చిబౌలి క్రీడా సముదాయంలో జరగనున్నాయి. గ్రాండ్ ఫైనల్స్ జైపూర్‌లో డిసెంబరు 1 నుంచి 16వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే వారు www.SFAPLAY.com వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలి.



మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే గాంధీ సమీక్ష

హైదర్‌నగర్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి డివిజన్‌లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తున్నామని, వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు చేపడతామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం వివేకానందనగర్‌లోని తన కార్యాలయంలో మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట, చందానగర్ డివిజన్ల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను వెంటనే పునరుద్ధరించాలని, అవసరమైన చోట గుంతలను పూడ్చి ప్యాచ్‌వర్క్‌లు చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో వేగం పెంచాలని, అలసత్వం ప్రదర్శించకూడదని, పెండింగ్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, అవసరమైన చోట కొత్త ప్రతిపాదలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యల పట్ల పూర్తిస్థాయిలో సన్నద్ధం అయ్యేలా ఉండాలన్నారు. అవసరమున్నచోట యుద్ధప్రాతిపదికన రోడ్లు మరమ్మతులు చేపట్టాలన్నారు. అదేవిధంగా కాలనీల్లో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ కేవీస్ రాజు, డీఈ స్రవంతి, డీఈ దుర్గప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

చెరువుల కబ్జాలతోనే ముంపు సమస్యలు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కుత్బుల్లాపూర్‌లోని చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. పలు చెరువుల అలుగు పారుతున్నాయి. మొగుళ్లకుంట చెరువు పూర్తిగా నిండిపోయి అలుగు పారడంతో అపర్ణ పాలోంగ్రోమ్ కాలనీ నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రోడ్లు జలమయమయ్యాయి. మొగుళ్లకుంట నిండిన త్వరాత వరద కాలువ ద్వారా ఊరచెరువులో వరదనీరు చేరేది. వరదకాలువ కుదించుకుపోవడం, కబ్జాకు గురికావడంతో నీరంత కాలనీలోని రోడ్లపై ప్రవహిస్తూ ఇళ్లను ముంచెత్తుతోంది. ఊరచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఓ వ్యక్తి మట్టి పోసి చదును చేశాడు. ఈ విషయంపై అప్పట్లో పలుపత్రికల్లో కథనాలు రావడంతో గండిమైసమ్మ, దుండిగల్ ఎమ్మార్వోలు తమ సిబ్బందితో చెరువును సందర్శించి బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటుచేసి మట్టిని తొలగిస్తామన్న చెప్పి మిన్నకున్నారు. దీంతో వర్షాలకు ఊరచెరువులో చేరుతున్న నీరంత అలుగు ద్వారా బయటుకు పోవడమే కాక చెరువు కట్టకు రంధ్రాలు పడి కట్టకింద ఉన్న దేవేందర్‌నగర్ కాలనీలోకి నీరువచ్చి చేరుతోంది. 2016, 18వ సంవత్సరంలో వర్షాలు అధికంగా కురవడంతో ఎన్‌హెచ్ 44 కొంపల్లి బిడ్జి సమీపంలో వరద నీరు అధికంగా రావడంతో వాహనాల రాకపోకలు రాకపోకలు నిలిచిపోయాయి.

నిధులు మంజూరైనా నాలా నిర్మాణం పూర్తికాలే..

నిజాంపేట్: వర్షం పడినప్పుడల్లా తురకచెరువు నుంచి వచ్చే భారీ వదరనీరు అంబీర్ చెరువుకు వెళ్లడానికి సరియైన నాలా లేకపోవడంతోనే నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీలోని పాపయ్యకుంట నుంచి సిరిబాలాజీ వరకు ముంపు సమస్య ఉంటుంది. ఇలా వర్షం పడిన ప్రతీసారి సమస్య ఉత్పన్నమవుతుందని కార్పొరేషన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్‌లోని ఆయా కాలనీల్లో ఆయనతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు ఆప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఎస్ఎన్‌డీపీ కింద 220 కోట్ల రూపాయలు గతంలో మంజూరైనా పనులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. బాక్స్ కాలం నిర్మాణానికి కేటాయించి 91 లక్షల రూపాయలు నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. తక్షణమే తురకచెరువు నుంచి బండారు లేఅవుట్ వరకు ఎస్ఎన్‌డీపికి వర్షపునీటి నాలాను నిర్మించాలని, పాపయ్యకుంట నుంచి సిరిబాలాజీ కుంట వరకు బాక్స్‌కాలం నాలాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



నిజాంపేట పరిధిలో రోడ్డుపైకి వచ్చిన వరదనీటిని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు



మట్టిగణపతులను పంపిణీ చేస్తున్న ఎంపీ విశ్వేశ్వరరెడ్డి

మట్టి గణపతులను పూజిద్దాం

గచ్చిబౌలి, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఏడాది మట్టి గణపతులను తయారు చేయించి నియోజకవర్గంలోని కాలనీల్లో ఆర్‌కేవై ఫౌండేషన్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం మట్టిగణపతుల పంపిణీ కార్యక్రమానికి ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి హాజరై రవికుమార్‌తో కలిసి గణేశులను పంపిణీ చేశారు.

● **మియాపూర్:** మియాపూర్‌లోని క్యాస్టిల్‌టౌన్‌లో బుధవారం హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ కొండ విజయ్‌కుమార్ విద్యార్థులకు మట్టి గణపతులను పంపిణీ చేశారు.

● **షాపూర్‌నగర్:** ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వద్దు.. మట్టితో చేసిని గణనాథులే ముద్దు అని పర్యావరణవేత్తలు ఘోషిస్తున్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలు నేపథ్యంలో పర్యావరణం పరిరక్షించేందుకు మట్టితో తయారైన గణనాథులనే పూజించాలని పలువురు కోరుతున్నారు. గణపతి మండపాలు సిద్ధం చేస్తున్నారు.

● **నిజాంపేట్:** పర్యావరణ హితం కోసం మట్టి విగ్రహాలను పూజించుకోవాలని భాగ్యనగర్ ఉత్సవ కమిటీ కో-కన్వీనర్ సుబ్బారావ్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని భాగ్యనగర్ ఉత్సవ కమిటీ, బాలాజీ హిల్స్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను బుధవారం పంపిణీ చేశారు.

● **కేపీహెచ్‌బీకాలనీ:** కేపీహెచ్‌బీ ఆరోఫేజ్‌లోని నెక్స్‌జెన్ స్కూల్లో బుధవారం మట్టి వినాయక ప్రతిమలను చిన్నారులకు అందజేశారు.



కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు

బస్తీదవాఖానాను తనిఖీ చేసిన కార్పొరేటర్

మియాపూర్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ హెచ్ఎంటీ కాలనీలో బస్తీ దవాఖనాకు స్థానిక నాయకులు, కాలనీవాసులతో కలిసి మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. హెచ్ఎంటీ కాలనీ బస్తీ దవాఖానాను పరిశీలించించినట్లు తెలిపారు. వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే సొంతవైద్యం తీసుకుకోకుండా దగ్గరలో ఉన్న బస్తీదవాఖానాలోని డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. బస్తీ దవాఖానాకు వచ్చే వారికి నాణ్యమైన వైద్యసేవలను అందించాలని వైద్యులకు కార్పొరేటర్ సూచించారు. కార్యమంలో స్థానికులు దేవేందర్‌రావు, దశరథ్‌రావు, విద్యానందచారి, సురేష్, రమేష్, చంద్ర, నర్సింగ్‌రావు, విరూపక్షయ్య కాలనీ వాసులు పాల్గొన్నారు.

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, ఆచార్య వై రెడ్డిశ్యామల

గచ్చిబౌలి, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శేరిలింగంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వాయియాదవ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆచార్య వై.రెడ్డి శ్యామల హాజరై ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన



దోమల మందు పిచికారి చేస్తున్న అధికారులు

హైదర్‌నగర్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ విజయనగర్ కాలనీలో కూకట్‌పల్లి డివిజన డిప్యూటీ కమిషనర్ కృష్ణయ్య, ఎంటమాలజిస్ట్ ఉదయ్, మనోహర్ సిబ్బందితో కలిసి వర్షాకాలం నేపథ్యంలో బుధవారం ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం దోమల నివారణ మందు పిచికారి చేయించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్ నర్సింహులు, ఎంటమాలజీ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇళ్లలోకి వచ్చిన వరదనీరు బయటకు వెళ్లేలా చర్యలు

హైదర్‌నగర్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా 124 డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని గురుగోవింద్‌సింగ్ కాలనలో వరదనీరు ఇళ్లలోకి వచ్చి స్థానికులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ బుధవారం సమస్యను పరిశీలించారు. కాలనీ వెనుక పొంగుతున్న వరదనీటిని జీహెచ్ఎంసీ సిబ్బంది జేసీబీ సాయంతో దారి మళ్లించి ఓపెన్‌నాలాలోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎప్పుడు లేనివిధంగా వరదనీరు రావడంతో కాలనీ ప్రజలు ఆందోళన పడ్డారని, ఇప్పుడు వరదనీరు వచ్చినా అవి నాలాలో వెళ్లేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. భాస్కర్, శ్రీనివాస్, సంగమేష్, రాజుగౌడ్, శివ పాల్గొన్నారు.